సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అష్టగణపతుల నిలయం

శ్రీముఖలింగంలో అష్ట గణపతులు కొలువై ఉన్నారు. ఆలయం నలుమూలలా విగ్రహాలు ఉన్నాయి.

- 8లో

17న డీవార్మింగ్ డే

అరసవల్లి: ఈ నెల 17న డీవార్మింగ్‌డేను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.మీనాక్షి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు రెండేళ్ల వరకు అరమాత్ర, 2 నుంచి 19 ఏళ్ల పిల్లలకు ఒక మాత్రను నమిలి మింగించాలన్నారు. వీరందరికీ ఈ నెల 17న మాత్రలు వేయించాలని, ఆ రోజు వేయలేని వారికి డీవార్మింగ్ మాపప్ డే గా ఈనెల 25న మిత్రలు మింగించాలని సూచించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు రేపు

పొందూరు: స్థానిక నెహ్రూ పార్కు ఆవరణలో ఈ నెల 16న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నామని పొందూరు కబడ్డీ యూత్ అధ్యక్షుడు అనకాపల్లి బుజ్జి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వాన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు అందించనున్నామని చెప్పారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు 16 ఉదయం 10 గంటల్లోగా జట్లను నమోదు చేసుకోవాలని కోరారు.



జీఓ రద్దు చేయాలి

జీఓ నంబర్ 85ను తక్షణమే రద్దు చేయాలి. గతంలో ఉన్న క్లినికల్ సీట్లకు 30 శాతం, నాన్ క్లినికల్ సీట్లకు 50 శాతం రిజర్వేషన్ కొనసాగించాలి.

– ఎస్.భాస్కరరావు, మెడిసిన్ విద్యార్థి తండ్రి, టెక్కలి



సీట్ల తగ్గింపుతో నష్టపోతాం...

ఎంబీబీఎస్ సీట్ల తగ్గింపుతో మెడికల్ సీట్ల కోసం ఆశిస్తున్న ఎంతో మంది విద్యార్థులు నష్టపోతారు. నీట్‌లో ర్యాంకులు వచ్చినప్పటికీ ఎంబీబీఎస్ సీట్లు తగ్గడంతో సీట్లు సాధించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో లాంగ్‌టెర్మ్ కోచింగ్ తీసుకున్నాను. దీనికి మా తల్లిదండ్రులకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. ఇప్పుడు సీట్లు తగ్గించడం వల్ల ఎంబీబీఎస్ సీట్లు వస్తాయో రావో అనే ఆలోచన కలుగుతోంది. యథావిధిగా మెడికల్ సీట్లు ఉంచాలి.

– జి.హిమశ్రీ, నీట్ ర్యాంకర్, టెక్కలి

అవకాశం కోల్పోతాం

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు వచ్చే అవకాశం కోల్పోతాం. ప్రభుత్వ కళాశాలల్లో సీటు వస్తే నాణ్యమైన విద్య అందటంతో పాటు విద్యకు అయ్యే ఖర్చు భారం తల్లిదండ్రులకు తగ్గుతుంది.

– వైశ్యరాజు హర్షిత, కొత్తూరు శ్రీకాకుళం



ఐ యో్యా రామా..



శ్రీకాకుళంలో ఓ పన్నెండేళ్ల అబ్బాయి నేత్ర వైద్యురాలు బొడ్డేపల్లి అనూష వద్దకు వెళ్లాడు. ఈ అబ్బాయి క్లాస్‌లో నోట్స్ రాయలేకపోతున్నాడు. కారణమేంటా అని ఆరా తీస్తే ఈ కుర్రాడు అస్తమానూ సెల్ చూడడం వల్ల దృష్టి లోపం వచ్చింది.

1. ఇక్కడే ఎనిమిదేళ్ల అమ్మాయి తరచూ తలనొప్పి అంటూ వైద్యురాలి వద్దకు వెళ్లింది. ఈ అమ్మాయిని అన్నీ అడిగి చూస్తే రాత్రి 1 గంట వరకు టీవీ, మొబైల్ చూస్తానని చెప్పింది. దీంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.

టెక్కలి జిల్లా ఆస్పత్రిలో కంటి వైద్యురాలు నిఖిత వద్దకు ప్రతి రోజూ 50 మంది వరకు వస్తారు. వీరిలో 7-10ఏళ్ల పిల్లలే ఎక్కువ.

2. ఈ ఆస్పత్రిలోని డీఈఐసీ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్)కు వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే వారిలో ప్రతి రోజూ 15 మంది వరకు చిన్నారులకు కంటి సమస్యలే కనిపిస్తున్నాయి. నెలకు సుమారుగా 250 మంది వరకు చిన్నారులు కంటి సమస్యలతో ఈ కేంద్రానికి వస్తుంటారు. అందరి సమస్యకు ఒకే కారణం సెల్‌ఫోన్

చిన్నారుల చూపు ప్రమాదంలో పడుతోంది. నానాటికీ పెరుగుతున్న సెల్‌ఫోన్ వినియోగంతో వారి కళ్లు పొడిబారిపోతున్నాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు వందల సంఖ్యలో పిల్లలు డ్రై ఐ సిండ్రోమ్ అనే సమస్యతో బాధ పడుతున్నారు. ఈ విపత్కర అలవాటు ఆగకపోతే ఈ తరమంతా కళ్లద్దాలు ధరిస్తే గానీ చూడలేని స్థితికి చేరుకుంటుంది.

– శ్రీకాకుళం కల్చరల్/టెక్కలి/సోంపేట

- పొడిబారుతున్న చిన్నారుల కళ్లు
- డ్రై ఐ సిండ్రోమ్‌తో చిన్నారుల్లో కంటి సమస్యలు
- సెల్‌ఫోన్ వినియోగమే అసలు కారణం
- మేలుకోకుంటే ముప్పు తప్పదని వైద్యుల హెచ్చరిక

వైద్యుల మాట...

అవసరం మేరకే వాడాలి



నేను పల్లెలు, పట్టణాల్లో విద్యార్థులను పరీక్షించాను. చాలా మంది స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడ్డారు. దీని వల్ల వారి కంటిపై ఒత్తిడి పెరిగి కంటి ముందు కార్నియా పొర ముందుకు సాగి హ్రస్వదృష్టి (మయోపియా) సమస్య తలెత్తుతోంది. కళ్లద్దాల ద్వారా సరిచేయడం వల్ల మెల్లకన్ను, శాశ్వత అంధత్వం నుంచి కాపాడుతున్నాం. స్మార్ట్‌ఫోన్ అవసరం మేరకు మాత్రమే వాడాలి.

– ఎంకేఆర్ దాస్, పారా మెడికల్ ఆప్తాలమిక్ అధికారి

కార్నియా అల్సర్లు వస్తాయి..



పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలి. పిల్లల ఎదురుగా తల్లిదండ్రులు అదే పనిగా స్మార్ట్‌ఫోన్ చూడడం తగ్గించాలి. ముఖ్యంగా క్వారీల్లో పనిచేసే కార్మికులు, వెల్డింగ్ పనిచేసే కార్మికులు తమ కళ్లకు అద్దాలను పెట్టుకుని పనిచేయాలి. చిన్నపాటి కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. లేకపోతే కార్నియా అల్సర్ వచ్చి కళ్లు పోయే ప్రమాదం ఉంది.

– ఎం.సాయి నిఖిత, కంటి వైద్య నిపుణులు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

వారానికి రెండు గంటలే..



డీఈఐసీ కేంద్రానికి వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చే పిల్లల్లో అధికంగా కంటి సమస్యలతో వస్తుంటారు. అధికంగా దూర దృష్టి సమస్యలు చెబుతుంటారు. వారంలో రెండు గంటల కంటే ఎక్కువ స్క్రీన్ చూడకూడదు. పిల్లలను స్మార్ట్ గాడ్జెట్స్‌కు దూరంగా ఉంచాలి. పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాలి. నిత్యం అదే పనిగా ల్యాప్‌టాప్, కంప్యూటర్ వద్ద పనిచేసే వారంతా బ్లూకట్ గ్లాస్ ధరిస్తే మంచిది.

– ఎస్.రాజశేఖర్, చిన్న పిల్లల వైద్యుడు (డీఈఐసీ), జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

రిఫ్రెక్టివ్ ఎర్రర్ ఎక్కువ..



చిన్న పిల్లల్లో రిఫ్రెక్టివ్ ఎర్రర్‌ను ఎక్కువగా గుర్తిస్తున్నాం. చిన్న పిల్లలకు మొబైల్స్ ఇవ్వడం వల్ల ఈ సమస్య వస్తుంది. మూడేళ్ల లోపు పిల్లలకు మొబైల్స్ ఇవ్వకపోవడమే మంచిది. స్కూల్‌కు వెళ్లే పిల్లలు చాలా మందికి బోర్డుపైన టీచర్ రాసినవి కనించకపోవడంతో, పక్కనున్న పిల్లాడి బలపం(పలక) లేదా పుస్తకం చూసి రాస్తుంటారు. అది టీచర్స్ గమనించి వెంటనే వారి తల్లిదండ్రులకు చెప్పాలి. కళ్ల సమస్యలను తేలిగ్గా తీసుకుంటే చూపు పోయే ప్రమాదముంది.

– డాక్టర్ ఎంకే నంద, నేత్ర వైద్య నిపుణురాలు, ఆరోగ్య వరం కంటి ఆస్పత్రి, సోంపేట

ఆరు బయట వెన్నెలను చూస్తూ రాత్రిళ్లు వీధిలో ఆడుకోవడం ఓ జ్ఞాపకంగా మిగిలిపోయింది. తాతయ్య ఒడిలో కూర్చుని కథలు వినడం గతమైపోయింది. ఇప్పుడు అందరు పిల్లలదీ ఒకటే పని.. సెల్‌ఫోన్ చూడడం. స్కూల్‌కు వెళ్లే ముందు అందులో వీడియోలు చూడడం, స్కూల్ నుంచి వచ్చాక ఆ స్క్రీన్‌కే కళ్లు అప్పగించేయడం, రాత్రి తినే ముందు మళ్లీ సెల్‌ఫోన్ ఆన్ చేయడం, పడుకోవాలన్నా అమ్మానాన్నలను కాదంటూ మొబైల్ గేమ్స్‌కు అంకితమైపోవడం.. కలగలిపి చిన్నారులను బాని'సెల్'గా మార్చేస్తున్నాయి. ఈ విపరీత పరిణామం వారి కంటిచూపును పోగొడుతోంది. పరిమితికి మించి వినియోగిస్తుండడంతో చేటు చేస్తోంది.

చిన్నారుల చూపునకు చేటు



పిల్లలో కళ్ల సమస్యలన్నీ సెల్, ట్యాబ్, టీవీల కారణంగానే వస్తున్నాయి. కళ్లతో పాటు మెదడుపై కూడా వీటి ప్రభావం ఉంటుంది. డ్రై ఐ సిండ్రోమ్(కళ్లు పొడిబారి మాటిమాటికీ ఆర్పుతూ ఉండడం), రిఫ్రాక్టివ్ ఎర్రర్ సమస్యలతో చాలా మంది పిల్లలు బాధ పడుతున్నారు. రెండేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలకు సెల్‌ఫోన్ గానీ టీవీ గానీ దగ్గర నుంచి చూపించనే కూడదు. 2-4 ఏళ్ల పిల్లలు అరగంటకు మించి చూడకూడదు. పిల్లలు స్క్రీన్‌కు అతుక్కుపోకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

మితిమీరితే అనర్థమే..

- నిద్ర లేవగానే సెల్‌ను చూడడం వల్ల ఒత్తిడి పెరిగి శరీరంలో అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది.
- కేవలం మొబైల్‌కు అలవాటు పడడం వల్ల శారీరక శ్రమ తగ్గి ఊబకాయం వస్తుంది.
- నిద్రపోయే ముందు మొబైల్స్ వాడటం వల్ల నిద్రలేమి వల్ల మరుసరి రోజు దినచర్య మందగిస్తుంది.
- స్మార్ట్ ఫోన్ ఎక్కువ సమయం వాడటం వల్ల కళ్లు పొడి బారి తలనొప్పితో 'డ్రై ఐ సిండ్రోమ్' అనే కంటి వ్యాధికి గురవుతారు.
- స్మార్ట్‌ఫోన్‌ను ఇష్టానుసారం వాడితే నేర ప్రవృత్తి పెరిగే అవకాశం ఎక్కువ ఉంటుంది.
- సామాజిక స్పృహ తగ్గి, స్నేహితులు లేక, ఇంట్లో వాళ్లతోనూ కలవక ఒంటరిగా జీవించడం అలవాటైపోతుంది.



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థినికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సాయి నిఖిత



సెల్‌ఫోన్ చూస్తున్న చిన్నారులు

SUNDAY SPECIAL
జీవన శైలి


- చదువుపై ధ్యాస తగ్గి, చదువుదామంటే అక్షరాలు అలికినట్లు కనపడతాయి.

కత్తెర వేయాల్సిందే..

- కంప్యూటర్ గానీ, స్మార్ట్ ఫోన్ వినియోగంలో గానీ స్క్రీన్‌కు కంటికి మధ్య కనీసం 25 అంగుళాలు దూరం ఉండాలి.
- మానిటర్ కళ్లకు దూరంగా 30 డిగ్రీల యాంగిల్‌లో వంచి ఉంచినట్లు ఉండాలి.
- నేరుగా కళ్లను గాలి ప్రసరణ దిశగా ఉంచడం వల్ల కళ్లు పొడిబారే ప్రమాదం ఉంది. ప్రతి 20 నిమిషాలకు కళ్లకు విశ్రాంతి నివ్వాలి.
- కళ్లను ఒక పద్ధతి ప్రకారం మూసి తెరవడం వల్ల కళ్లు తేమగా ఉండి ప్రకాశవంతంగా ఉంటాయి.
- దృష్టి లోపం ఉంటే తప్పనిసరిగా వైద్యులు సూచించిన కళ్లద్దాలు ధరించాలి.
- ఎక్కువగా నీరు తాగాలి.

తల్లిదండ్రులారా మీకే ఈ జాగ్రత్తలు

- పిల్లల ముందు తల్లిదండ్రులు అదే పనిగా సెల్ చూడకూడదు.
- పిల్లలు ఆన్‌లైన్‌లో పాఠ్యాంశాలు నేర్చుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలి.
- పిల్లలు బయట ఆడుకునేలా ప్రోత్సహించాలి.
- ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి.
- సులభంగా తినిపించేందుకు, నిద్ర పుచ్చేందుకు సెల్‌ఫోన్, టీవీ చూపించే అలవాటును మానుకోవాలి.





టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గల డీఈఐసీ కేంద్రంలో చిన్నారికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాజశేఖర్

అశ్రద్ధగా ఉంటే ప్రమాదమే..



కంటి సమస్యలపై అశ్రద్ధ చూపకూడదు. పిల్లలు సరైన న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోకపోవడం వల్ల విటమిన్–ఎ తక్కువవుతోంది. దీని వల్ల చిన్నప్పటి నుంచి చూపు మందగిస్తోంది. కంప్యూటర్‌తో పనిచేస్తున్న వారు నిరంతరంగా 2 గంటల పాటు పనిచేస్తే తప్పనిసరిగా 15 నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి.

– డాక్టర్ రామారావు, నేత్ర వైద్య నిపుణుడు, ఆరోగ్య వరం ఆస్పత్రి, సోంపేట

జనం మెచ్చిన లచ్చన్న




కర్ణం లచ్చన్న

చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కర్ణం లచ్చన్న. సారవకోట మండలంలోని అలుదు గ్రామంలో ఎక్కడ ఎప్పుడు అన్నదానం జరిగినా 35 కిలోల బియ్యం, రూ.500 నగదు ఇవ్వడం ఈయనకు అలవాటు. ఆలయాలకు కూడా తనను తోచినట్టుగా సాయం చేస్తుంటారు. ఇక్కడి స్వర్ణమణి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఆర్థిక సాయం చేశారు. ఉమాత్రైలోకేశ్వర స్వామి ఆలయానికి రూ.12 వేలు విలువ గల మైక్‌సెట్‌ను అందజేశారు. మండలాధీశ్వర, సోమనాధీశ్వరస్వామి ఆలయాల్లో యాత్ర మహోత్సవాలు నిర్వహించే సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలకు సాయం చేస్తుంటారు. సారవకోట, అలుదు, కుమ్మరిగుంట, వడ్డినవలస తదితర గ్రామాల్లో ఈయనను తాతయ్యా అంటూ ఆప్యాయంగా పిలుస్తారు. ఇంతకీ ఈయన వృత్తి ఏంటో తెలుసా.. యాచకత్వం. అవును.. భిక్షమెత్తుకుంటూనే ఈయన ఇలా దానధర్మాలు చేస్తుంటారు. నలభై ఏళ్ల కిందట భార్య, బిడ్డను పోగొట్టుకుని కత్తిరివానిపేట నుంచి అలుదు వచ్చిన లచ్చన్న అప్పటి నుంచి యాచన చేసుకుంటూ దానాలు చేస్తూ అందరికీ తలలో నాలుకలా మారారు.

– సారవకోట

డీజే బీటు.. గుండెకు చేటు



టెక్కలి: సాధారణంగా మనిషి చెవులు 85 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని తట్టుకోగలవు. ఆ పరిమితి దాటితే చెవికే కాదు గుండెకూ ప్రమాదం వస్తుంది. కానీ డీజే సౌండ్ బాక్సుల నుంచి వచ్చే శబ్దమెంతో తెలుసా..? ఏకంగా 150 నుంచి 200 డెసిబెల్స్. ఇప్పుడు వినాయక చవితి నిమజ్జనోత్సవాలు జరుగుతున్నాయి. ఒకప్పటిలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి వినాయకుడిని సాగనంపే అలవాటు పోయింది. అన్ని ఊరేగింపుల దగ్గరా డీజేల శబ్దాలే. ఈ డీజేల నుంచి వచ్చిన డెసిబుల్స్ శబ్దాలు అధికంగా ఉండడంతో హుషారుగా నృత్యాలు చేస్తూ అక్కడికక్కడే కుప్పకూలిపోతున్నారు. వీరిలో ప్రధానంగా యువతతో పాటు 60 ఏళ్ల వయసులోపు ఉన్న వారు అధికంగా ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. రాజాం మున్సిపాలిటీ పరిధిలో పొనుగుటివలసలో శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనంలో భాగంగా డీజే సౌండ్‌కు 20 ఏళ్ల యువకుడు వావిలపల్లి వినయ్ గుండె పోటుతో ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు వినయ్‌ను విశాఖపట్నం తరలించారు.

ఎందుకంత ప్రమాదం..?

- ఇద్దరు మాట్లాడుకుంటే 20 డెసిబుల్స్ శబ్దం వస్తుంది. గట్టిగా అరుచుకుంటే 30-40 డెసిబుల్స్ ఉంటుంది.
- 85 డెసిబుల్స్ దాటిన శబ్దాలను ఎనిమిది గంటలపాటు వింటే కొద్దిరోజుల్లోనే చెముడు వస్తుంది. ప్రభుత్వం 75 డెసిబుల్స్ వరకు మాత్రమే అనుమతి ఇస్తుంది. డీజే సౌండ్స్ 200 డెసిబుల్స్ దాటిపోతోంది.
- పరిధికి మించి శబ్దాలను వినడం వల్ల గుండెపోటు రావచ్చు.
- చెవిలో వుండే కాక్లియా అనే భాగం శబ్ద తరంగాలను మెదడుకు చేరుస్తుంది. పరిధికి మించిన శబ్దాలను వినడం వల్ల కాక్లియాలో వుండే నరాలు ఒత్తిడికి గురై డ్యామేజీ అయి వినికిడి కోల్పోయే ప్రమాదం ఉంది.

హార్ట్‌బీట్ పెరిగి కుప్పకూలిపోతారు



డీజేల నుంచి వచ్చిన పాటలకు హార్ట్‌బీట్ మరింత పెరిగి సాధారణం కంటే అధికంగా శారీరక శ్రమతో నృత్యాలు చేస్తారు. దీంతో ఒక్కసారిగా హార్ట్‌బీట్ పెరిగి గుండెకు వెళ్లాల్సిన రక్తప్రసరణ నిలిచిపోయి ఒక్కసారిగా కుప్పకూలిపోతారు. ఇటీవల కాలంలో డీజేల వల్ల ఎంతో మంది యువత మృత్యువాత పడ్డారు.

– ఎస్.విజయ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

చిట్టి ముత్యాలు.. గట్టి డిమాండ్



- చిట్టి ముత్యాలు బియ్యానికి గిరాకీ
- పలావ్, బిర్యానీ, స్వీట్ల తయారీకి వినియోగం

శ్రీకాకుళం: చిట్టి ముత్యాలు బియ్యానికి డిమాండ్ పెరుగుతోంది. ఈ రకం బియ్యంతో రాజుల కాలం నుంచి ప్రత్యేక వంటకాలు తయారు చేసేవారు. బాస్మతి రాకతో వీటి వినియోగం బాగా తగ్గిపోయింది. ధర కాస్త ఎక్కువే అయినా పోషక విలువలు బాగా ఉండడంతో మళ్లీ వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ రకం బియ్యంతో పలావ్, బిరియానీ, పాయసం, పరమాన్నంతో పాటు మరికొన్ని మిఠాయిలు తయారు చేస్తారు. చిట్టిముత్యాలు బియ్యంతో ఎలాంటి వంట చేయాలన్నా మిగిలిన వాటితో పోల్చితే సులువుగా ఉంటుందని వంట నిపుణులు చెబుతుంటారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో ఈ రకం సాగు కూడా ఇప్పుడు పెరుగుతోంది. ప్రస్తుతం 10 నుంచి 15 హెక్టార్లలో చిట్టి ముత్యాల పంటను సాగు చేస్తున్నారు. బాస్మతిని బియ్యం చేసేందుకు అవసరమయ్యే మిల్లులు లేవు. చిట్టి ముత్యాలు మాత్రం సాధారణ మిల్లుల్లో బియ్యం మర పట్టవచ్చు.

మార్కెట్ వాచ్

చార్జింగ్ కేబుల్ రక్షణ బాధ్యత నాది..



వేలాది రూపాయల ఖర్చుతో సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేస్తాం. దానికి స్క్రీన్ గార్డు వేస్తాం. పౌచ్ కొంటాం. భద్రంగా చూసుకుంటాం. మరి దీనికి చార్జింగ్ అందించే కేబుల్ విషయంలో మాత్రం ఎలాంటి శ్రద్ధ చూపం. సెల్‌ఫోన్ రక్షణ కవచాల మాదిరిగానే చార్జింగ్ కేబుల్ రక్షణకూ యాక్సెసరీస్ ఉన్నాయండోయ్. స్ప్రింగ్ తరహాలో ఉన్న రబ్బర్ స్పైరల్‌ను దీని రక్షణకు వినియోగిస్తే కేబుల్‌ను చాలా కాలం వాడుకోవచ్చు. ఈ కేబుల్ ప్రొటెక్టర్లు ఆన్‌లైన్‌తో పాటు నగర మార్కెట్‌లోనూ లభ్యమవుతున్నాయి.



ధరలు: నాలుగు ప్రొటెక్టర్లు: రూ.60 నుంచి రూ.100 వరకు ఉన్నాయి.

–శ్రీకాకుళం కల్చరల్

● ఈశుని ఆలయం.. అష్ట గణపతుల నిలయం


విశిష్ట శిల్ప సంపద.. అరుదైన ముఖాకృతి.. ఘనమైన చరిత్ర.. కలగలిపి శ్రీముఖలింగం. ఈ విశిష్టతల జాబితాలో ఇంకో అంశం కూడా ఉంది. అదే అష్ట గణపతుల విగ్రహాలు. ఏ దేవాలయంలోనైనా ఒక్కడే గణపతి కనిపిస్తాడు. కానీ శ్రీముఖలింగంలో మాత్రం అష్ట గణపతులు కొలువై ఉన్నారు.

– జలుమూరు



శక్తి గణపతి

అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక బాధలు తొలగిపోవాలని ఈ గణపతిని పూజిస్తారు. ఇంద్రుని ఆలయం తూర్పు దిక్కున పశ్చిమ ముఖంగా దర్శనం ఇస్తారు స్వామి.



చింతామణి గణపతి

చింతలు, దుఃఖాలు, ఈతి బాధలు పోగొట్టే స్వామి. దక్షిణవైపు ఉత్తర ముఖంగా ఉంటారు.




డుండీ గణపతులు

పంచాయతన క్షేత్రానికి సంబంధించి కాశీలో రెండు గణపతి విగ్రహాలు ఉంటాయి. మళ్లీ శ్రీముఖలింగంలోనే రెండు గణపతులు కనిపిస్తారు. ఈ ఇద్దరు స్వాములను దర్శనం చేసుకుంటే చాలు మనస్సులో కోర్కెలు, మోక్షం సిద్ధిస్తుందని అర్చకులు చెబుతున్నారు. ఉత్తర ముఖం దక్షిణంలో కొలువు దీరి ఉంటారు.




సాక్షి గణపతి

భక్తులు ఆలయానికి వచ్చిన తర్వాత ముందుగా ఈ స్వామిని దర్శనం చేసుకుంటే ఈయన తన తండ్రి అయిన పరమేశ్వరునికి చెబుతారంట. భక్తులు నా అనుమతి తీసుకున్నారు.. మీరు మీ దర్శనం బాగ్యం కల్పించాలని కోరుతారట. దక్షిణ ముఖంగా ఉత్తర వైపు కొలువై ఉంటారు.




నాట్య గణపతి

కళాకారులు, విద్యార్థులు నాట్యం తదితర కళలు నేర్చుకునే ముందు ఈ స్వామిని దర్శించుకోవాలంటారు. తూర్పు ముఖం పశ్చిమలో భక్తులకు దర్శనం ఇస్తారు.



కార్యసిద్ధి గణపతి

మనస్సులో ఒక కార్యం తలచుకొని ఈ స్వామికి చెబితే చాలు ఆ కార్యం నెరవేరుతుంది. ఆలయం పైన దక్షిణ ముఖం ఉత్తర దిక్కుగా ఉంటారు.



వరసిద్ధి గణపతి

వరాలు ప్రసాదించే స్వామివారు. భక్తులు కోరిన వరాలు ఇస్తారు. వారాహి అమ్మవారు ముందు ఎడమ వైపు దక్షిణ ముఖంతో భక్తులు దర్శనం ఇస్తారు.

పల్లె తల్లడిల్లుతోంది..

- జిల్లాలో గ్రామీణ వైద్య సేవలు బంద్
- గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఓపీ రోగులకు తప్పని పాట్లు
- అత్యవసర సేవలకు మాత్రమే అటెండ్ అయిన పీహెచ్‌సీ వైద్యులు
- 17 నుంచి నిరాహార దీక్షలకు సన్నాహాలు
- ఇప్పటికే అధికారిక సమావేశాలకు హాజరుకాకూడదని నిర్ణయించిన వైద్యులు



చాపర పీహెచ్‌సీలో ఓపీ రోగులకు తమ పరిస్థితులను వివరిస్తున్న వైద్యురాలు

అరసవల్లి:

గ్రామీణ, ఏజెన్సీ వైద్యులు బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వ ఇన్ సర్వీస్‌తో పీజీ సీట్ల కేటాయింపు కోటాను కుదించేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం పిలుపుతో జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో వైద్య సేవలు శనివారం నుంచి నిలిచిపోయాయి. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లను కూడా పీహెచ్‌సీ వైద్యులు బాయ్‌కాట్ చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు తీవ్రతరమవుతున్న తరుణంలో రోగులకు వైద్యుల సేవలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది. జిల్లాలో ఉన్న మొత్తం 71 పీహెచ్‌సీల్లో మొత్తం సుమారు 124 మంది గ్రామీణ వైద్యులు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర పీహెచ్‌సీ సంఘ వైద్యుల సంఘ ప్రతినిధుల పిలుపుమేరకు ఈ నెల 10 నుంచే దశలవారీగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో యథావిధిగా షెడ్యూల్ ప్రకారం శనివారం నుంచి వైద్య సేవలను పూర్తిగా బంద్ చేశారు.

అసలే జ్వరాలు.. ఆపై బంద్‌లు

జిల్లాలో మొత్తం 71 పీహెచ్‌సీలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. వీటిలో శనివారం నుంచి అత్యవసర సేవలు మినహా ఇతర వైద్య సేవలన్నీ బంద్ కావడంతో స్థానికులు ముఖ్యంగా సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో శనివారం ఉదయానికి వైద్యులంతా విధులకు హాజరైనప్పటికీ ఎలాంటి ఓపీ కేసులను చూడలేదు. ఒకట్రెండు చోట్ల అత్యవసర కేసులను మాత్రం పరిశీలించి మెరుగైన చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పరిస్థితులు విషమించిన వారికి, గర్భిణులకు మాత్రం ఒకింత సహకరించి పరీక్షలు చేసి పంపించారు. మామూలుగా రోజుకు ఒక్కో పీహెచ్‌సీకి ఓపీ కేసులు కనీసంగా 40 నుంచి 50 వరకు నమోదయ్యేవి. ఈ లెక్కన శనివారం ఒక్కరోజే జిల్లాలో సుమారు 3 వేల మందికి పైగా ఓపీ సేవలు అందనట్టింది.

నేడు చలో విజయవాడ

గ్రామీణ వైద్యుల ఆందోళన మరింత తీవ్రతరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరి డిమాండ్‌పై ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా బాధ్యత వహించకుండా వ్యవహరిస్తున్న రాష్ట్ర సర్కార్‌పై వైద్యులు భగ్గుమంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆదివారం 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలో పీహెచ్‌సీ వైద్యులంతా కలిసి విజయవాడ వెళ్లి అక్కడే హెల్త్ డైరెక్టరేట్‌ను మరోసారి కలవనున్నారు. అయితే షెడ్యూల్ నోటీస్ ప్రకారం మంగళవారం నుంచి వైద్యులు నిరాహార దీక్షలకు దిగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదే జరిగితే గ్రామీణ ప్రాంత వైద్యానికి పెద్ద బ్రేక్ పడనుంది. వేలాది మంది గ్రామీణ రోగులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలాలేవు.

జీఓ 85 రద్దు వరకు పోరాడుతాం..



జీఓ నంబర్ 85ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. లేదంటే అంతవరకు మా పోరాటాలు ఆగవు. మేమంతా పీజీ చదివి మరింత మెరుగైన వైద్య సేవలందిస్తామంటే కోటా కింద చదివించలేమని ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణంగా ఉంది. దశాబ్దాల కాలం నుంచి ఉన్న విధానాన్ని కాదని, ఇప్పుడు పూర్తిగా సీట్ల కోటాను కుదించడాన్ని మేమంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మంగళవారం నుంచి నిరాహార దీక్షలు చేస్తాం.

– డాక్టర్ సందీప్, జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ అధ్యక్షుడు

జ్వరం, వాంతులతో బాధపడుతున్నాను



గత రెండు రోజులుగా నేను జ్వరం, వాంతులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామం వద్ద ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాను. అయితే ఇక్కడ వైద్యులు లేకపోవడంతో అక్కడ సిబ్బంది కొన్ని నామమాత్రపు మాత్రలు ఇవ్వడంతో వాటినే తీసుకుని ఇంటికి వెళ్లిపోయాం.

– బొంగు మల్లేష్, కె.కొత్తూరు గ్రామం, టెక్కలి మండలం

వైద్యానికో దండం



జ్వరంతో బాధపడుతూ నీరసంగా ఉందని ఆస్పత్రికి వచ్చాను. ముందురోజు ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే సెలైన్ ఎక్కించారు. శనివారం పీహెచ్‌సీకి వస్తే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ ఉన్న సిబ్బంది సెలైన్ ఎక్కించేందుకు నరం దొరకలేదని ఇష్టమొచ్చినట్లుగా సూదులతో గుచ్చేశారు. దీంతో నా చేయి వాచిపోయింది సరికదా సెలైన్ ఎక్కించేందుకు కూడా అవ్వలేదు.

– లోళ్ల రాములమ్మ, పెద్దసాన గ్రామం, టెక్కలి మండలం

హోరాహోరీగా టెన్నీకాయిట్ పోటీలు



క్రీడా జ్యోతిప్రజ్వలన చేస్తున్న అధికారులు

వజ్రపుకొత్తూరు రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 36వ ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల (రాష్ట్ర స్థాయి) బాల బాలికలు టెన్నికాయిట్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ పోటీల్లో క్రీడాకారులు ముందుగా ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడలతో ఉన్నతమైన గుర్తింపు లభిస్తుందని అన్నారు. పోటీలకు కృష్ణా, ప్రకాశం జిల్లా క్రీడాకారులు మినహా మిగిలిన జిల్లాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఆటలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ క్రీడలకు పోత్సహించిన డాక్టర్ తమ్మినాన పాపినాయుడు, డాక్టర్ అన్నెపు సుశీలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సంతోష్ కుమార్, కార్యదర్శి ఎస్‌వీ జోగారావు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వైద్య సేవలపై అసంతృప్తి



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పీఎం, బయోవేస్ట్ మెడికల్ విభాగం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు

టెక్కలి: రాష్ట్రంలో గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కనీసం బీమా సైతం చెల్లించలేదని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. శనివారం టెక్కలిలో పర్యటించారు. ముందుగా స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం విభాగం, బయోవేస్ట్ మెడికల్ విభాగం ఏర్పాటుపై స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆస్పత్రికి సమీపంలో గోశాల నిర్మాణంపై స్థల పరిశీలన చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లు సక్రమంగా నిర్వహించాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. రైతులను అన్ని విధాలా ఆదుకునేది తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. ఇటీవల విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో 95 శాతం మేర సంతృప్తి చెందామన్నారు. ప్రతిపక్ష నాయకుడు జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి విమర్శించడం కాదని, ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మేజర్ పంచాయతీలో పుట్‌పాత్ దుఖాణదారులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

13.57 కిలోల గంజాయి స్వాధీనం

ఇచ్ఛాపురం: పట్టణంలో గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను రైల్వేస్టేషన్ రోడ్‌లో గల ఆర్ అండ్ బీ బంగ్లా సమీపంలో శనివారం పట్టుకున్నారు. ఈ విషయమై సాయంత్రం సీఐ మీసాల చిన్నంనాయుడు విలేకరులతో మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు ఒడిశాలోని కందమాల్ జిల్లా దరింగబడి నుంచి అక్రమంగా గంజాయిని బెంగళూరుకి రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వీరి వద్ద నుంచి 11.07 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కర్నాటక రాష్ట్రం, షిమోగ జిల్లా, కరెకల్ గ్రామం ఇందిరానగర్ కాలనీ చెందిన ఎస్.రాజేష్, హరేజ్ గ్రామానికి చెందిన జి.మధులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం

ఆమదాలవలస: పట్టణంలోని బీఆర్ నగర్ సమీపంలో ఐదుగురు యువకుల నుంచి రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వివేకానంద తెలిపారు. శనివారం సీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్ కలిసి శుక్రవారం సాయంత్రం బీఆర్ నగర్ సమీపంలో దాడులు నిర్వహించగా ఐదుగురు యువకులు పట్టుపడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి చిన్న చిన్న పొట్లాలుగా కట్టిన రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు. పోలీసు విచారణలో ఐదుగురు యువకులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని దిగుమతి చేసి పట్టణంలో విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు.

క్లుప్తంగా

జాతీయ లోక్ అదాలత్‌లో 2719 కేసులు రాజీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 2719 కేసులు రాజీ అయ్యాయి. జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో అదాలత్‌ను నిర్వహించారు. అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ యుగంధర్, బెంచ్‌లో ఒక కేసులో వాది ప్రతివాదులైన రెడ్డి శ్రీనివాసరావు, రెడ్డి కృష్ణవేణి దంపతులు ఇరువురు తమ వైవాహిక జీవితాన్ని కొనసాగించడానికి అదాలత్‌లో రాజీకి వచ్చి ఒప్పుకున్నారు.

నాటుకోళ్ల మృతిపై విచారణ

కోటబొమ్మాళి: బలరాంపురం గ్రామంలో నాటుకోళ్ల మృతిపై శనివారం వెటర్నరీ ఏడీ మంద లోకనాథం విచారణ చేపట్టారు. మృతి చెందిన కోళ్ల నమూనాలు సేకరించారు. వివరాలు ఆరా తీసి కోళ్లకు టీకాలు వేశారు.

మాకివలస కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా



మాకివలసలో నిల్వ ఉంచిన ఇసుక పోగులు

జలుమూరు: జలుమూరు మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మొన్న పర్లాం, నిన్న రామకృష్ణాపురం, నేడు మాకివలస గ్రామం కేంద్రాలుగా ఇసుక ట్రాక్టర్లు, లారీలతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. మాకివలసకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఇదంతా జరుగుతోంది. మాకివలస టీడీపీ నాయకుని కల్లం స్థలంలోనే గ్రామానికి పక్కనే ఉన్న వంశధార నది నుంచి 200 మిషన్లతో ట్రాక్టర్లకు లోడింగ్ చేయించి ఇక్కడే నిల్వ చేస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత బెంజ్ లారీలకు లోడింగ్ చేసి విశాఖ తరలిస్తున్నారు. సరుబుజ్జిలి వద్ద గ్రామస్తులు ఆ లారీలను అడ్డుకోగా.. మండల టీడీపీ నాయకుడు చొరవ తీసుకొని లారీకు కొంత మొత్తం ఇవ్వ జూపి పని కానిచ్చేస్తున్నారు. ఈ నాయకులపై మిగిలిన నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఎస్ఐ అశోక్ బాబు మాట్లాడుతూ రాత్రిపూట షిఫ్ట్ డ్యూటీలు వేస్తున్నామన్నారు.

టోల్‌గేట్ వద్ద లారీల క్యూ



మడపాం టోల్‌గేట్ వద్ద ఉన్న లారీలు

నరసన్నపేట: మండల పరిధిలో వంశధార గుల్లవుతోంది. గోపాలపెంట, లుకలాం, ఉప్పరిపేటల్లో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. సెబ్ పోలీసులు లేకపోవడంతో ఇసుక తవ్వకాలకు అడ్డూ అదుపు లేకుండాపోతోంది. మడపాం టోల్‌గేట్ వద్ద క్యూ కట్టిన లారీలే ఇందుకు సాక్షి. రాత్రి సమయాల్లోనే ఇక్కడ ఇసుక తరలింపు జరుగుతోంది. వంశధారలో నీరు వచ్చినా లుకలాం, గోపాలపెంటల్లో ఇసుక తవ్వకాలకు అనువుగా ఉంటుంది. దీన్ని అవకాశంగా తీసుకొని ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.

హుండీ పగలగొట్టి..

హిరమండలం: కిట్టాలపాడు గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీ దొంగతనం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆంజనేయస్వామి గుడిలో చొరబడి హుండీని ఎత్తుకెళ్లి పగలగొట్టి పొదల్లో పడేశారు. ఆ సమయంలో వినాయక ఉత్సవాల దగ్గర భజన కార్యక్రమం ముగించి గుడి వైపు వస్తున్న కొంతమంది గ్రామస్తులు వారిని గమనించి పట్టుకోవడానికి ప్రయత్నించగా ఇద్దరు ఒకరు దొరికిపోవడంతో అతడిని చెట్టుకు కట్టేశారు. శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మహ్మద్ యాసిన్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ 22వ వార్డు లక్ష్మిడిపేటకు చెందిన కిల్లి మణికంఠ (21) శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికంఠ తండ్రి అన్నంనాయుడు విశాఖపట్టణంలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్కడే ఉండి చదువుకుంటున్న మణికంఠ శనివారం తండ్రిని తన బైక్‌పై డ్యూటీ పాయింట్‌కు దించి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో హనుమంతు వాక ప్రాంతంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే చనిపోయాడు. అన్నంనాయుడుకు పెళ్లయిన చాలాకాలానికి పిల్లలు పుట్టకపోతే, అయ్యప్ప మాల వేసుకుని మొక్కుకుంటే మణికంఠ జన్మించాడు. ఇప్పుడు ఒక్కగానొక్క కుమారుడు ఇలా దూరమవ్వడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

యువకుడి మృతికి వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపల చిరంజీవిరావు, పార్టీ కార్యకర్తలు బొడ్డేపల్లి విజయ్‌కుమార్, దుంపల శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.

పామాయిల్ తోటలో విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

పొందూరు: మండలంలోని గారపేట సమీపంలోని శనివారం జరిగిన ప్రమాదంలో దళ్లిపేట గ్రామానికి చెందిన భోగ రాము(42) మృతి చెందాడు. ఆయన కొన్నేళ్లుగా తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. కొమ్మలు కోస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈయనకు భార్య రాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ శవ పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

నెలలోనే ప్యానల్ ఏర్పాటు

అరసవల్లి: పీఎం సోలార్ సూర్యఘర్ పథకంపై గృహ విద్యుత్ వినియోగదారులు అవగాహన పెంచుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఒక నెల లోనే సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నామని ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు తెలియజేసారు. ఈమేరకు జెడ్పీ దరి కంపోస్టు కాలనీలో స్థానికులతోనూ అలాగే సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల అవగాహన కోసం వేర్వేరుగా శనివారం ప్రత్యేక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనే సోలార్ ప్యానల్స్ వెండర్ల పేర్లుంటాయని, వినియోగదారుడే స్వయంగా ఎంపిక చేసుకునే అవకాశముందన్నారు. రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గిరిజనులు ఓట్లు అమ్ముకోవద్దు

- అధికారులు మన సేవకులు.. వారు మన వద్దకే రావాలి
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



మెళియాపుట్టి: కేరాసింగిలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

మెళియాపుట్టి: 'కేరాసింగి గ్రామానికి వచ్చేటప్పుడు రహదారిని చూశా ఏమీ బాగాలేదు.. ఇప్పటికీ ఇంకా ఇలాంటి గ్రామాలు ఉన్నాయంటేనే ఆశ్చర్యంగా ఉంది. గిరిజనుల సమస్యలు పరిష్కారం కాకపోతే గ్రామాల్లోనే ధర్నాలు చేయండి. అధికారులు మనకు సేవ చేయడానికే ఉన్నారు. వారి చుట్టూ మనం తిరగాల్సిన అవసరం లేదు. వాళ్లనే మన గ్రామాలకు రప్పించండి' అంటూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ గిరిజనులకు హితబోధ చేశారు. మండలంలోని అత్యంత ఎత్తైన గిరిజన గ్రామమైన కేరాసింగి గ్రామాన్ని ఆయన శనివారం సందర్శించారు. గిరిజనుల జీవన విధానాన్ని పరిశీలించి, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రహదారి, తాగునీరు, వీధి దీపాలు, సీసీ రోడ్లు వేయాలని, పాఠశాల భవనం, అదేవిధంగా అంగన్‌వాడీ భవనం నిర్మించాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్ర గిరిజన సంఘం నాయకులు వాబయోగి మాట్లాడుతూ మెళియాపుట్టి మండలానికి ఐటీడీఏ తీసుకురావాలని విన్నవించారు. హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. రహదారి సదుపాయమే లేకుంటే మిగతా సమస్యలు ఎలా పరిష్కరమవుతాయని ఐటీడీఏ అధికారులను ప్రశ్నించారు. మూడునెలల్లో మళ్లీ కేరాసింగి గ్రామానికి వస్తానని రహదారి పూర్తి కావాలని ఆదేశించారు. ఆయనతో పాటు సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, టెక్కలి ఆర్డీఓ సుదర్శన్ దొర, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దున్నే వాడిదే భూమి

జలుమూరు: దున్నేవాడిదే భూమి అని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం మాకివలసలో గిరిజనులతో మాట్లాడి అనంతరం సమావేశంలో మాట్లాడారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా తాను వస్తే అధికారులు చిన్న చిన్న గోతులు కూడా పూడ్చలేదంటే, ఇక గిరిజనులకు ఏం సౌకర్యాలు కల్పిస్తారని అసహనం వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలో సుమారు 45 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, ఇక్కడ చాలా వరకూ అరాచకాలు జరుగుతున్నాయని, హరే రామ సంస్థకు భూములు ఎలా కేటాయిస్తారని, కనీసం శ్మశానానికైనా రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించలేదని పలువురు గిరిజనులు ఆరోపించారు. దీనిపై ఆయన స్పందించి తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గిరిజన సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్ తెగల జీవితాల్లో వెలుగు నింపడానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాటోతు హుస్సేన్ మాట్లాడుతూ ఎస్టీ హాస్టళ్లలో సదుపాయాలు పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్డు సదుపాయం లేని గ్రామం ఉండకూడదన్నారు. కమిషన్‌కు సివిల్ కోర్టుకుండే అధికారాలుంటాయని, గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, సమస్యలు పరిష్కరించేందుకు పని చేస్తుందన్నారు.